


# పడమెళ్ళి పోయింది

యెలిశెట్టి శంకరరావు

"జీవితం ఓ విషాద ప్రవాహం"

ఈ వాక్యం రామ్మూర్తి జీవితానికి బాగా అన్వయిస్తుంది ఒకప్పుడు జీవితం మాధుర్యాల జోనల అనే నమ్మకం అతని కుండేది. అలాంటికలల 'రోజుల్ని' ఇప్పు డిప్పుడే మర్చిపోతున్నాడతను. కారణం?

కనీసపు కోర్కెల్ని కూడా అవమానించిన పేదరికం- ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్-అనాకరితనం- సున్నితంగా ఉండే మనసుతో ఆడుకున్న ఆడవాళ్లు-ఎదురుదెబ్బలు తిని రాటుదేలిపోయిన మనిషిలోని 'మరోమనిషి'—మూడున్నర పదులు దాటిపోయిన వయస్సు-కల అందంగానూ, నిజం చేదుగానూ ఉంటే, చేదులా వికృతంగా ఉండే వాస్తవ పరిస్థితులు-ఒంటరితనం-వీటిలో ఏ ఒక్కటి లేదా అన్నీ అతని నిస్తేజానికి, నిర్లిప్తతకి ప్రశాంతంగాగడుస్తున్న బతుక్కి ప్రేరకాలు కావచ్చు.

ఒక సంతోషం లేదా దుఃఖం అతన్ని అంతగా కదిలించవేమో అన్నట్లుంటాడు రామ్మూర్తి. బ్రహ్మచారి జీవితం కావటం వల్ల 'తన' అని చెప్పుకోవటానికి తన వాళ్లంటూ ఎవరూ లేకపోవటం వల్ల రామ్మూర్తి అట్టే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసిన అవసరం కూడా లేదు.

ఆఫీసు అయ్యాంతర్వాత-ఓ గంట సేపు తన ఒకే ఒక్క మిత్రుడు-కొలీగ్ మోహన్రావ్‌తో కబుర్లు, తర్వాత హోటల్ భోజనం-గదికిచేరుకుని పుస్తకాలుచదువు

ఉంటూ అర్ధరాత్రి వరకూ గడిపి తర్వాత నిద్రపోవటం- రామ్మూర్తి కలవాటు. పుస్తకాలు చదవటం అనేది రామ్మూర్తి విషయంలో అలవాటు నుంచి పిచ్చిగా ప్రమోషన్ పొందింది. సాహిత్యంతో పరిచయం పెరిగి పెరిగి రామ్మూర్తిని రచయితగా మార్చింది. రచయితగా రామ్మూర్తి కిప్పుడు గుర్తింపు, అంతర్గతంగా ఏ పెదవి మీదైనా చిన్న చిరునవ్వు వెలిగించాలనే కోరిక ఉన్నాయి.

అలాంటి రామ్మూర్తి విలక్షణమైన విచిత్రవ్యక్తి.

ఎందుకంటే ?

• • •

ఆ రోజు 'పేదరికం' కథకి మొదటి బహుమతి వచ్చిందని తెలిసినప్పుడు, రెండే రెండు క్షణాలు సంతోషంగా ఫీలయ్యాడు రామ్మూర్తి. వెంటనే ఎవరో కసిరినట్లు మొహం మామూలుగా పెట్టేసుకున్నాడు.

రామ్మూర్తికి సింహాచలంగుర్తొచ్చాడు.

సింహచలం రామ్మూర్తి ప్రేరణ.

రామ్మూర్తి కథలు - నిజజీవితంలో కూడా ఓ సజీవపాత్ర!!

చింతపల్లి తాలుకా ఆఫీసులో పని చూసుకుని తిరిగివిశాఖపట్నం వస్తున్నాడు రామ్మూర్తి. బస్సు కిటికీలోంచి పచ్చని ప్రకృతిని చూస్తూ పరవశత్వం పొందుతున్నాడు ఆకాశం నిండా నల్లని మేఘాలు క్రమ్మేసి ఉన్నాయి. చల్లని గాలి బస్సులోకి విసురుగా జొరబడుతోంది. సన్నగా మొదలైన వర్షంలో రోడ్డుకు రెండు ప్రక్కలా కమలాకోటలూ పనసకోటలు తడుస్తూ ఈదురుగాలికి పులకరిస్తున్నాయి.

లంబసింగిలో హఠాత్తుగా చిన్న కుదుపుతో బస్సు ఆగిపోయింది వర్షం సన్నగా కురుస్తూనే ఉంది. 'టీకి దిగండి సార్!' అందర్నీ ఉద్దేశించి చెప్పి క్రిందకి దిగాడు డ్రైవర్ వెనకనే క్యాష్‌బాగ్ బుజానికి తగిలించుకుని డ్రైవర్ని అనుసరించాడు కండక్టర్

బాగా చలిగా ఉందేమో కాసిని టీనీళ్లు గొంతులో పడితే బావుంటుందని బస్సు దిగి రోడ్డువారగా ఉన్న రెల్లుగడ్డితో నేసిన పూరిపాకలోకి నడిచాడు రామ్మూర్తి

ఆ చిన్నపాక అంతా బస్సులోని ప్రయాణీకుల్తో నిండిపోయింది. ఓ మూలగా ఉన్న నులకమంచంమీద బాగా చేనుకుని కూర్చున్నాడు రామ్మూర్తి

నలభై ఏళ్ల మగవాడు, ముప్ఫయ్యేళ్ల ఆడమనిషి హడావుడిగా అందరికీ అడిగిన ఫలహారాలు, కాఫీలు అందిస్తున్నారు.

రామ్మూర్తి టీ పుచ్చుకుని త్రాగబోతుంటే సన్నగా కూనిరాగం వినిపించింది. అప్రయత్నంగా తల తిప్పి అటువైపు చూసాడు. ఎవరో కుంటి బిచ్చగాడు గోగ చూరిఉన్న రాటికి ఆనుకుని తన్మయంగా పాడుకుంటున్నాడు.

నలభై ఏళ్ళ పైనే వయస్సుంటుంది జీర్ణావస్థలో ఉన్న దుస్తులు. దీనంగా



ఉన్నాడు. బాగా పెరిగిన గుబురు గడ్డం ముడతలు పడిన మొహం. చిందరవందరగా జుట్టు విషాదంగా ఉన్న కళ్లల్లో పడుతోంది వాడిలో సత్తుగిన్నె పొదివి పట్టుకొన్నాడు రామ్మూర్తిని ఆకర్షించినది ముఖ్యంగా అతని కళ్లు మొత్తం జీవితంలో చేదుని మోసిన కళ్లు. నెమ్మదిగా అతన్ని మాటల్లోకి దించాడు రామ్మూర్తి.

అతని పేరు సింహాచలం చిన్నప్పుడెప్పుడో ఓ బస్సు ప్రమాదంలో కాళ్లుపోయాయి. సింహాచలం అమ్మా, బాబు దరిద్రులు, బస్సు ఓనరు ధనవంతుడు కాబట్టి- దరిద్రులకి దేవుడే దిక్కు కాబట్టి, ధనవంతుడు పోలీసులు కలిసి కేసు లేకుండా చేశారు దేవుడు చూడకుండా.

దేవుడు సీరియస్‌గా మామూలు ధోరణిలో 'ఆయాం హెల్ప్‌లెస్' అన్నాడు. అతని అంతేవిటో కనుక్కుందామని రెండేళ్లల్లో వరసగా సింహాచలం అమ్మా, బాబు దేవుడి దగ్గిరి కెళ్లిపోయేరు.

ఆ తర్వాత సింహాచలం ఆకలేసి ఏడ్చేడు. ఏడిస్తే కడుపు నిండదని గ్రహించి అడుక్కోవటం మొదలెట్టేడు. ఆ బ్రతుకే కంటిన్యూ అవుతూంది. ఇప్పుడు సింహాచలానికి క్షయున్న భార్యతో పాటు, అగ్రోజులుగా తిండిలేని ఆరేళ్ల

కొడుకు_ఆ కొడుకుని సరదాగా పరామర్శించి పర్మినెంటుగా ఉండిపోయిన పోలియో_ ఈ మధ్యనే వాణ్ని చూట్టానికొచ్చిన రెండువారాల వయసున్న జ్వరం _వీళ్లందరూ కలిసి తలదాచుకోవటానికి ఊరవతల పాడుపడిన సత్రంలో ఓ మూల శిథిలావస్థలోఉన్న గది ఉన్నాయి. ఎవరైనా ధర్మప్రభువులు కనికరించి పైసలు రాలిస్తే ఆ పూట గంజి తాగటం, లేనినాడు పస్తులు పడుకోవటం అలా సింహాచలం కుటుంబం సుఖంగా బ్రతికేస్తున్నారు ఈ దేశంలో కోట్లాదిమందిలా.

"ఏటుంటాది బాబయ్యా! మా బొట్టిడికి జొరం బాబయ్య! ఎందుకొచ్చినా దమ కుంటున్నారేటి తిండి లేకొచ్చినాది బాబయ్య! తిండెడితే జొరం పోద్ది! మరో రెండ్రోజులు తిండిలేకపోతే ఏకంగా అదే పోతాడు! వాలాటి ముష్టోడి కడుపున పుట్టినందుకు తిట్టుకోని, తిట్టుకోని గిల గిల్లాడి సచ్చిపోతాడు. అంతే బాబయ్యా మాలాంటోళ్ల బతుకులు అట్టాగే ఉంటాయి!" సింహాచలం స్వరం దీనంగా పలికింది. కళ్లలో తడిపొర.

రామ్మూర్తి కళ్లు అప్రయత్నంగా చెమర్చాయి. ప్రయాణీకులందరూ బస్సెక్కిపోయారు. డ్రైవర్ హారన్ కొడుతున్నాడు. రామ్మూర్తి సింహాచలం చేతిలో అయిదు రూపాయల నోటు పెట్టి వచ్చేసాడు. బస్సులో ప్రయాణం చేస్తున్నంతసేపు రామ్మూర్తి ఆలోచనల్లో సింహాచలమే మెదిలాడు

'ఎన్ని లక్షల, కోట్ల కుటుంబాలు ఇలాంటి దారిద్రావస్థలో ఉన్నాయి. ఎవరి ఊహల్లోనూ క్షణకాలం కూడా మెదలక అజ్ఞాతంగా బ్రతుకుతున్న శవాలెన్నీ దేశంలో? ఈ చీకటి బ్రతుకులు వెలుగు చూసేదెప్పుడు? ఈ బ్రతుకుల్లోకి వెన్నెల రావటానికి ఏంచెయ్యాలి?'

ఆలోచనల్లోనే విశాఖపట్నం చేరుకున్నాడురామ్మూర్తి. రెండురోజుల్లోనేసింహాచలాన్ని అతని కుటుంబాన్ని పక్షెక్టుగా తీసుకుని కథ రాసాడు. కథ ముగింపు పేదరికానికి పరిష్కారం బాగా వచ్చింది. ధనవంతులు దరిద్రులు అన్న ప్రశ్న లేకుండా మనుషుల్ని జాతీయం చేసేస్తే ఆకలి చావులు, దరిద్రం అన్న ప్రశ్నలు తలెత్తవు. కనీసం ధనవంతుడు దరిద్రుడ్ని సానుభూతిగా చూసేటట్లు చేయగలిగిందే ఉత్తమ సంఘం.

ఆ కథకి పోటీలో వెయ్యిరూపాయలు మొదటి బహుమతి వచ్చింది. రెండు వారాల్లో ఆ చెక్కు అందుకుంటున్నప్పుడు హఠాత్తుగా రామ్మూర్తికో ఆలోచన వచ్చింది

'ఈ డబ్బు సింహాచలానిది!' ఈ ఆలోచన మనసులో ఉదయించగానే రామ్మూర్తికి సంతోషం వేసింది

తనకెలాగూ ఈ డబ్బుతో పెద్ద ఉపయోగం లేదు. ఇదే డబ్బుతో సింహాచలం కుటుంబానికి ఆధారం కల్పించవచ్చు.

అతను ఏ చిన్న కొట్లో పెట్టుకుని తన భార్యాబిడ్డల్ని పోషించుకోగలుగుతాడు.

ఈ ఆలోచన రావటం, ఆలోచనతో పాటు ఆఫీసుకి వరసగా రెండ్రోజులు సెలవులు రావటంతో తనకున్న ఒకే ఒక్క స్నేహితుడు మోహన్‌ని కూడా తోడుతీసుకుని సింహాచలం దగ్గరకి వెళ్దామని నిర్ణయించుకుని మోహన్ ఇంటికి వెళ్లాడు రామ్మూర్తి.

రామ్మూర్తి తన ఆలోచన చెప్పేసరికి ముందు నిర్ఘాంతపోయాడు మోహన్. తర్వాత రామ్మూర్తిని ఓ వెర్రివెధవని చూసినట్టు చూసాడు. ఆ తరవాత రామ్మూర్తిమీద విరుచుకపడ్డాడు.

"నీ కసలేమైనా బుద్ధుందా? వెధవా? అసలు మనిషివేనా? దున్నపోతువా? నీ డబ్బు నీ కక్కర్లేదు ఎవరో ముష్టాడికి యిచ్చేస్తానంటావేరా?డబ్బెందుకని అడిగే పిచ్చి వెధవని నిన్నే చూసాను ఈ ప్రపంచం మొత్తంమ్మీద! ఫోఫో! ఇంటికి పోయి ఆడబ్బు ఏ బ్యాంకులోనో దాచుకో! పెళ్ళిపెటాకులు లేకుండా ఒంటరిగా బ్రతుకుతున్నాను నీ కెందుకీ డబ్బనుకుంటున్నావేమో? రేపొద్దుట ముసలితనంలో ఈ డబ్బే గనక లేకపోతే నీ మొహం కుక్కకూడా చూడదు!"

రామ్మూర్తి మోహన్‌తో ఎక్కువ వాదించకుండా తిరిగి ఇంటికి వచ్చేసాడు. అతని ఆలోచన్లు చిత్రంగా పరిగెడుతున్నాయి.

మనిషి ఆలోచనలు ఎంత స్వచ్ఛంగా ఉన్నప్పటికీ స్వార్థం అనే విషబిందువు స్పర్శ తగిల్తే చాలు అక్కడ్నుంచి ఆ ఆలోచన్లు పరావర్తనం చెందుతాయి. ఆ మరుక్షణంలో మనిషి ఆలోచనలు తీసుకునే నిర్ణయాల్ని బట్టి అతని విశిష్ట లేదా వికృత వ్యక్తిత్వం నిర్ణయింపబడుతుంది.

రామ్మూర్తి వ్యక్తిత్వం ఖచ్చితంగా విశిష్టవ్యక్తిత్వమే. 'సొంత లాభం కొంత మానుకొని పొరుగువాడికి తోడుపడవోయ్' గురజాడ రామ్మూర్తి గొంతుతో ఎలుగెత్తి చెప్తుంటే, "ఐశ్వర్యం పొడి ఇసుకలాంటిది. అది ఒక్కచోట స్థిరంగా ఉండదు. నలువైపులా చెదిరిపోతూ ఉంటుంది, అలాంటి రంగుకాగితాల్ని కామించి నీ తోటిమానవుడికి నువ్వెందుకు అన్యాయం చేస్తావ్?" మక్సిమ్ గోర్కీ దీనంగా అర్థిస్తుంటే రామ్మూర్తి కూడా అదే కోవలో ఆలోచిస్తున్నాడు.

ఐశ్వర్యం ఏటిఒడ్డున ఉన్న పడవలాంటిది అది మనిషిని తనతోపాటు అవసరాలనే ఏరు దాటించాలి. ఖాళీపడవ ఒంటరిగా అవతలి తీరం చేరితే పడవ ఉనికికి అర్థంఉండదు.

సింహాచలం రామ్మూర్తి కళ్ళముందు మెదిలాడు. జాలిగొలిపే అతని కళ్ళు—అవిటి జీవితం—రోగిష్టి భార్య—ఆకలితో అలమటించే కొడుకు—తిండీ, గుడ్డా, నీడా—కనీసావసరాలు కూడా నోచని పేద బ్రతుకు రామ్మూర్తిని చూసిపరిహసిస్తున్నట్టయింది

మోహన్‌తోపాటు, స్వార్థం నింపుకున్న నాగరిక ప్రపంచం మరోవైపు తన పిచ్చిఆలోచనను నవ్వుకొంటుందా?

రామ్మూర్తిలో చెలరేగే భావాల సంఘర్షణ నా జీవన ప్రమాణంమీద ఈ డబ్బు ప్రభావంఎంత? సింహాచలంజీవితంమీద ఈ ధనం ఎంత ప్రభావం చూపిస్తుంది నా దగ్గర ఇప్పటికే బ్యాంకులో పదివేల రూపాయలు ఉన్నాయి. నెలకి ఆరొందలు సంపాయించి పెట్టే ఉద్యోగం ఉంది.

నాకు చింతెందుకు? ఈ డబ్బుతో నా బ్యాంక్ బేలన్స్ మరో వెయ్యి పెరుగుతోంది. అదే సింహాచలానికిచ్చేస్తే మూడు ప్రాణులికి కొత్త జీవితాల్ని అందించిన వాడిని అవుతాను.

అవును! అదే న్యాయం.

ఈ నిర్ణయానికి వచ్చాక రామ్మూర్తి మనసు తేలికపడింది. అయితే ఈ నిర్ణయానికి రావటానికి రామ్మూర్తికి నెల రోజులు పట్టింది.

• • •

ఆ రోజు ఆదివారం. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం మరింతగా విజృంభించింది. మోహన్‌కి చెప్పకుండా ఒంటరిగా బస్సులో 'లంబసింగి' బస్సులో బయల్దేరాడు రామ్మూర్తి. ఆరు గంటల ప్రయాణం తర్వాత మొదటిసారి సింహాచలాన్ని చూసిన టీకొట్లోకి నడిచాడు. సింహాచలం గురించి వాకబుచేస్తే ఎందుకో అందరూ రామ్మూర్తిని వింతగా చూసారు. టీషాపతను ఓ చిన్నకుర్రాణ్ణి పిల్చి 'ఈ బాబుని సత్రంకాడికి తీసికెళ్రా' అన్జెప్పాడు. రామ్మూర్తి ఆశ్చర్యంగా ఆకుర్రవాడి వెనక నడిచి సత్రం బయట కనిపించిన దృశ్యం చూసి విశ్చేష్టంగా ఉండిపోయాడు. నాలుగు రోజుల్నించి ఏకధాటిగా కురిసిన వర్షానికి శిధిలమైపోయిన సత్రం కూలిపోయింది. ఆ శిధిలాల మధ్య నుంచి సింహాచలాన్ని,అతని భార్యా కొడుకుల శవాల్ని తీసి చెత్తల బండిలో వేస్తున్నారు.

వర్షం కురుస్తూనే ఉంది. చల్లగా గాలి వీస్తూనే ఉంది. విసురుగా వర్షం అందర్నీ తడుపుతోంది, సింహాచలంతో సహా గాలి అందరి శరీరాల్ని స్పృశిస్తోంది.

సింహాచలం బాధలకీ, కన్నీళ్ళకి, కష్టాలకీ, ఆకలికీ, ఐశ్వర్యానికీ, స్వార్థానికీ అన్నిటికీ అతీతంగా దూరంగా ప్రయాణమై కుటుంబంతో సహా నెమ్మదిగా సాగిపోతున్నాడు. జేబులో నిద్రపోతున్న కరెన్సీ కాగితాలు రామ్మూర్తిని చూడకుండా ఫక్కుమని నవ్వాయి.

'సింహాచలం! నెలరోజుల క్రిందట బలహీనమైన నా మనస్సులో పాపిష్టి స్వార్థం ప్రవేశించకుండా ఉంటే నేను నీకు సహాయపడి ఉండేవాణ్ణి. నువ్వు నీ కుటుంబం సజీవంగా ఉండేవారు. సాటి మానవుడా! నన్ను క్షమించు' తనలో తనే గొణుక్కున్నాడు రామ్మూర్తి.

మనుషుల్లో పెరుగుతున్న పాపంలా వర్షం పెరుగుతోంది. ఆ వానలో రామ్మూర్తి తడుస్తున్నాడు.

---